క్లుప్తంగా

ఓటరు స్లిప్పుల పంపిణీ

లింగాపూర్: మండలకేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాలలో ఇంటింటికి వెళ్లి బీఎల్‌వోలు ఓటర్ చిట్టీలు పంపిణీ చేశారు. పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ఈనెల 13న ఉండగా ఈనెల 8వ తేదీ వరకు పంపిణీ కార్యక్రమం ముగుస్తుందని పేర్కొన్నారు.

సన్మానం



సన్మానిస్తున్న మాలీ సంఘం నాయకులు

కెరమెరి: మండలంలోని సుర్దాపూర్ గ్రామంలో ఉద్యోగాలు పొందిన ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు అన్నదమ్ములను మాలీ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆదివారం వారిని శాలువాతో ఘనంగా సత్కరించారు. సుర్దాపూర్ గ్రామానికి చెందిన మొహర్లే సోమయ్య- తుల్సీబాయి దంపతుల ఇద్దరు కుమారులు మొహర్లే భీంరావు, విఠల్‌కు ఇటీవల ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. భీంరావు ఏకలవ్య మోడల్ స్కూల్‌లో టీజీటీ ఉద్యోగం, మొహర్లే విఠల్ ఆసిఫాబాద్‌లోని జిల్లా కోర్టులో ప్రాసెస్ సర్వర్ ఉద్యోగం పొందారు. మాలీ సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు కావ్‌డే తుల్సీరాం, ఆదే శ్యాంరావు, నాయకులు మనోహర్, రావుజి, శేషు, రాజేశ్, నారాయణ తదితరులు ఉన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు



స్థావరాలపై దాడులు చేస్తున్న అధికారులు

చింతలమానెపల్లి: మండలంలోని లంబాడీహెట్టి, రణవెల్లి గ్రామాల్లోని గుడుంబా స్థావరాలపై ఆదివారం కాగజ్‌నగర్ అబ్కారీశాఖ అధికారులు దాడులు చేశారు. ఈ దాడుల్లో పది లీటర్ల నాటుసారాను పట్టుకుని ఒకరిపై కేసు నమోదు చేసినట్లు అబ్కారీశాఖ కాగజ్‌నగర్ సీఐ రవి తెలిపారు. 3వేల లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు. దాడుల్లో ఎస్సై సురేశ్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

ఇచ్చోడ: మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో ఆదివారం ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను ప్రారంభించారు. మొదటి బహుమతి రూ. 20 వేలు, రెండో బహుమతి రూ 15 వేలు, మూడో బహుమతి రూ.10 వేల నగదుతో పాటుగా గెలుపొందిన జట్లకు ట్రోఫీ అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈపోటీలు వారం రోజుల పాటు కొనసాగనున్నట్లు పేర్కొన్నారు.

నేరడిగొండ: క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని తెలంగాణ రాష్ట్ర లెక్చరర్ల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ అన్నారు. ఆదివారం మండలంలోని వడూర్ గ్రామంలో గత 15 రోజులుగా జరుగుతున్న వడూర్ ప్రీమియర్ లీగ్-2 ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఎండ @ 46.1



కౌటాల: జిల్లాలో ఆదివారం భారీగా పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జిల్లాలో ఈసారి ఎన్నడూ లేని విధంగా వంకులం, కాగజ్‌నగర్‌లలో అత్యధికంగా 46.1 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎండలు మండుతుండడంతో ప్రజలు ఇళ్లల్లో నుంచి బయటకు రావడానికి జంకుతున్నారు. ద్విచక్ర వాహనదారులు, చిరువ్యాపారులు, వృద్ధులు, చిన్నారులు వడగాలులకు అల్లాడిపోతున్నారు. జిల్లాలోని కాగజ్‌నగర్ పట్టణంలో బీజేపీ బహిరంగ సభ ఉండడంతో కార్యకర్తలు, నాయకులు, ప్రజలు తలపాగా, స్కార్ఫ్‌లు, టోపీలు ధరించి ప్రయాణాలు చేశారు.

ఆదివారం నమోదైన పగటి ఉష్ణోగ్రతలు (డిగ్రీ సెల్సియస్‌లలో..)

ప్రాంతం	గరిష్ఠం
వంకులం	46.1
కాగజ్‌నగర్	46.1
ఆసిఫాబాద్	45.6
జంబుగా	45.2
తిర్యాణి	45.2
ధనోరా	44.9
రెబ్బెన	44.5
వాంకిడి	44.4
కౌటాల	44.3



పీహెచ్‌సీలో అక్రమ కట్టడాలు



ప్రైవేటు వ్యక్తులు ధ్వంసం చేసిన ప్రహరీ

- ప్రహరీ ధ్వంసం చేసిన వైనం
- అక్రమంగా సెప్టిక్ ట్యాంకుల నిర్మాణాలు
- ప్రభుత్వ భూములకు రక్షణ కరువు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు

పెంచికల్‌పేట్: మారుమూల గ్రామాల్లోని ప్రజలకు వైద్య సేవలు అందించడానికి నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని భూములకు రక్షణ కరువైంది. మండలం నడిబొడ్డున ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోకి ఆక్రమణదారులు చొచ్చుకొచ్చి అక్రమ కట్టడాలకు తెరలేపారు. గడిచిన సంవత్సర కాలంగా అక్రమంగా నిర్మాణాలు జరుగుతున్నా సంబంధిత శాఖ అధికారులతో పాటు రెవెన్యూ, పంచాయతీ అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తుండటంతో అధికారుల తీరుపై విమర్శలు విన్పిస్తున్నాయి.

ఆరోగ్య కేంద్రంలో ఆక్రమణలు..

పెంచికల్‌పేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సుమారు రెండు ఎకరాల స్థలం ఉంది. ఆరోగ్య కేంద్రం ప్రధానరోడ్డు నుంచి కుడివైపు ప్రహరీ గోడ నిర్మించారు. సంవత్సరం క్రితం కుడివైపు పీహెచ్‌సీని ఆనుకుని ఇంటిని నిర్మించుకున్న వ్యక్తి సుమారు 20మీటర్ల ప్రహరీ గోడను ధ్వంసం చేశారు. మరోవైపు ఆరోగ్య కేంద్రం ఎడమ వైపు ఉన్న ఇంటిని నిర్మించుకున్న మరో వ్యక్తి ఏకంగా ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం స్థలంలో మురుగునీటిని నిల్వ చేయటానికి మూడు పెద్ద సెప్టిక్ ట్యాంకుల నిర్మాణాలు చేపట్టాడు. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో అక్రమ కట్టడాలను అరికట్టి సదరు వ్యక్తులపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేయాల్సిన అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో అక్రమార్కులకు అడ్డూఅదుపు లేకుండా పోయింది. పలుమార్లు ఉన్నత అధికారులకు ఫిర్యాదులు చేసిన పట్టించుకోవడం లేదని మండలవాసులు వాపోతున్నారు.



పీహెచ్‌సీలో సెప్టిక్ ట్యాంకు నిర్మాణం

భూములకు రక్షణ లేదు



మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భూములకు రక్షణ కరువైంది. రెండు వైపుల నుంచి ఆక్రమణదారులు భూములను, ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తూ అక్రమ నిర్మాణాలు చేపడుతూ విలువైన ప్రభుత్వ భూములను కాజేస్తున్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కట్టడి చేయాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం విడ్డూరంగా ఉంది. ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.

– ఎనగందుల తిరుపతి, సామాజిక కార్యకర్త, పెంచికల్‌పేట్

అత్యుత్సాహంలో అధికారులు..

నెల రోజుల క్రితం కొంతమంది వ్యక్తులు ఆరోగ్య కేంద్రం ముందు ఖాళీ స్థలంలో ఫెన్సింగ్ పోల్స్‌తో కంచె ఏర్పాటు చేశారు. దీంతో పంచాయతీ అధికారులు, రెవెన్యూ అధికారులు, పోలీసులు సంయుక్తంగా ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసిన ఫెన్సింగ్ తొలగించారు. ముందు వైపు వేసిన కంచెను తొలగించిన అధికారులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లోపల జరుగుతున్న అక్రమ నిర్మాణాలను తొలగించడంలో అలసత్వం వహించడంపై అనుమానాలు తలెత్తుతున్నాయి. లక్షల రూపాయల విలువైన ప్రభుత్వ స్థలంతో పాటు, లక్షల రూపాయలతో నిర్మించిన ప్రహరీ కూల్చివేసినా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఆయా శాఖల అధికారులు స్పందించి ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం భూములను సంరక్షించాలని మండల వాసులు డిమాండ్ చేస్తున్నారు.

'యాజమాన్యం నిర్ణయం సరికాదు'



మాట్లాడుతున్న ఎస్.తిరుపతి

రెబ్బెన(ఆసిఫాబాద్): ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకుని ఓసీపీలు, సీహెచ్‌పీల్లో పనివేళల మార్పు విషయంలో సింగరేణి యాజమాన్యం నిర్ణయం సరికాదని ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి అన్నారు. గోలేటిలో ఆదివారం ఆయన మాట్లాడారు. ఏఐటీయూసీ నాయకత్వంలో నిరసనలు, వినతిపత్రాల సమర్పణ కార్యక్రమాలు నిర్వహించగా యాజమాన్యం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో ఓసీపీల్లో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపామన్నారు. కార్మికవర్గాన్ని ఎండల బారి నుంచి రక్షించేందుకు యాజమాన్యంతో పోరాడమన్నారు. అయితే యాజమాన్యం ఏకపక్షంగా కార్మికుల పనివేళలు మారుస్తూ నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. కార్మికులు కోరిన విధంగా కాకుండా వారిని మరింత ఇబ్బందులకు గురిచేసే రీతిలో పనివేళలు మార్చేందుకు నిర్ణయించడాన్ని ఏఐటీయూసీ పూర్తిగా వ్యతిరేకిస్తోందని స్పష్టం చేశారు. మొదటి షిఫ్ట్ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, రెండో షిఫ్ట్ సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు, రాత్రి షిఫ్టును యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. సోమవారం సంస్థ చైర్మన్‌ను కలిసి చర్చిస్తామని తెలిపారు. అప్పటివరకు పాత పనివేళలనే కొనసాగించాలని చైర్మన్‌ను కోరగా అంగీకరించారని తెలిపారు.

ఓటు వేసిన అదనపు కలెక్టర్

ఆసిఫాబాద్‌అర్బన్: లోక్‌సభ ఎన్నికల సందర్భంగా జిల్లా కేంద్రంలో అదనపు కలెక్టర్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి దాసరి వేణు ఆదివారం పోస్టల్ బ్యాలెట్ ద్వారా తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బంది తమ ఓటుహక్కు వినియోగించుకోవాలని సూచించారు. జిల్లాలో ఈ నెల 13న ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునేందుకు అన్ని చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు.



సిరా చుక్క చూపుతున్న అదనపు కలెక్టర్ దాసరి వేణు

అమ్మవారి ఆలయంలో భక్తుల పూజలు

రెబ్బెన: మండలంలోని ఇందిరానగర్‌లో గల కనక దుర్గాదేవి, స్వయంభూ మహంకాళి ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. మండలంలోని భక్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పట్టువస్త్రాలు, ఒడి బియ్యం, నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మొక్కులో భాగంగా పలువురు భక్తులు అమ్మవారికి తలనీలాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు దేవార వినోద్ భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.



అన్నదానం చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఆత్రం సక్కును ఎంపీగా గెలిపించాలి



దరోగపల్లిలో ఎన్నికల ప్రచారంలో దండె విఠల్



ప్రచారం చేస్తున్న జెడ్పీటీసీ అజయ్‌కుమార్

పెంచికల్‌పేట్: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కును భారీ మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. మండలంలోని దరోగపల్లి, పెంచికల్‌పేట్ గ్రామాల్లో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బీజేపీ, రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ పార్టీతో తెలంగాణ ప్రజలకు ఒరిగిందేమి లేదని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజల గొంతుక బీఆర్‌ఎస్ అభ్యర్థిని పార్లమెంట్‌కు పంపాలన్నారు. అంతకుముందు పంచకళపురి క్షేత్రంలోని శ్రీభద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు బిట్టి శ్రీనివాస్, మహేశ్, శేఖర్, కొల్లిపాక శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

వాంకిడి: కారు గుర్తుకు ఓటేసి బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు, జెడ్పీటీసీ అజయ్‌కుమార్ కోరారు. ఆదివారం మండలంలోని నవేధరి, జంబుల్‌ధరి గ్రామపంచాయతీల్లో పార్టీ నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గడపగడపకు తిరుగుతూ ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ జబోరె పెంటు, ఎంపీటీసీ ప్రవీణ్‌కుమార్, మాజీ సర్పంచులు తుకారాం, జైరాం తదితరులు పాల్గొన్నారు.



కెరమెరి: ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

కెరమెరి: రైతులతో పాటు అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పిందని ఎంపీపీ పెందోర్ మోతీరాం, జెడ్పీటీసీ దుర్పతబాయి, వైస్‌ఎంపీపీ అబ్దుల్ కలాం అన్నారు. ఆదివారం మండలంలోని ఇంద్రానగర్, అంతాపూర్, పద్మావతి, ఏసాపూర్, నారాయణగూడ, భోలాపటార్, ఎస్సీగూడ, లేడీంగూడ, గౌరీ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ప్రజల సమస్యలు తీర్చే ఏకైక పార్టీ బీఆర్‌ఎస్ అన్నారు. నాయకులు ఆనంద్‌రావు, రూప్‌లాల్, రాజయ్య, భీంరావు, దుందేరావు తదితరులు ఉన్నారు.

'కేంద్రంలో మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాలి'

వాంకిడి: నిరుద్యోగులకు మోసం చేసిన మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించడమే లక్ష్యంగా యువత పని చేయాలని డీవైఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి గొడిసెల కార్తీక్ అన్నారు. శనివారం మండలంలోని ఖిరిడి గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు మెనిఫెస్టోలో ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని, జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని యువతను మోసం చేశారని ఆరోపించారు. రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు యువత నడుం బిగించాలని పిలుపునిచ్చారు. ఇండియా కూటమిలోని కాంగ్రెస్ అభ్యర్థులకు ఓటేసి మతోన్మాద పార్టీని తరిమికొట్టాలని కోరారు. కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ మండల అధ్యక్షుడు నిఖిల్, కార్యదర్శి శ్రీకాంత్, నాయకులు తిరుపతి, కల్యాణ్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గొడిసెల కార్తీక్

'కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం'



రెబ్బెన: తుంగెడలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు



ఆసిఫాబాద్‌అర్బన్: చేతి గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న నాయకులు

రెబ్బెన: కాంగ్రెస్‌తోనే దేశంలో అభివృద్ధి సాధ్యమని పార్టీ యువజన నాయకులు పూదరి హరీశ్ అన్నారు. ఆదివారం మండలంలోని తుంగెడ, గోలేటిలోని భగత్‌సింగ్, దుబ్బగూడ, గంగాపూర్ గ్రామాల్లో కాంగ్రెస్ ఎన్నికల ప్రచారాన్ని జోరుగా నిర్వహించారు. తుంగెడలో ఆయన మాట్లాడుతూ దేశంలోని పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందాలంటే ప్రజలు కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరగాలంటే ఆదిలాబాద్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

హీరాపూర్‌లో..

ఆసిఫాబాద్‌అర్బన్: మే 13వ తేదీన జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి ఓటు వేయాలని ఆదివారం జిల్లా కేంద్రంలోని హీరాపూర్‌లో నాయకులు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేస్తుందన్నారు. నాయకులు రూప్‌నార్ రమేశ్, బాలేశ్వర్ గౌడ్, చరణ్, మారుతిపటేల్, గోవింద్, తిరుపతి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుప్పుమంటున్న గుడుంబా!



గుడుంబా స్థావరాలపై దాడులు చేసిన అధికారులు (ఫైల్)

- ఎన్నికల నేపథ్యంలో డిమాండ్
- ప్యాకెట్లుగా మార్చి ఇతర ప్రాంతాలకు సరఫరా
- 109 మందిపై కేసులు నమోదు

కౌటాల: జిల్లాలో మళ్లీ గుడుంబా గుప్పుమంటోంది. ఎంపీ ఎన్నికల నేపథ్యంలో గుడుంబా తయారీ జోరందుకుంది. గుడుంబా రహిత జిల్లాగా మార్చేందుకు ఎక్సైజ్, పోలీసు, రెవెన్యూ శాఖలతో పాటు స్వచ్ఛంద సంస్థలు ప్రయత్నాలు చేస్తుంటే జిల్లాలో యథేచ్ఛగా గుడుంబా తయారీ సాగుతోంది. ఎన్నికలను అదునుగా చేసుకొని మహారాష్ట్రలోని సరిహద్దు గ్రామాల శివారుల్లో అక్రమార్కులు గుడుంబా తయారీ కేంద్రాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. గుడుంబాను ప్యాకెట్లుగా మార్చి మద్యం ప్రియులకు విక్రయిస్తున్నారు. అధికారులు గుడుంబా తయారీ కేంద్రాలపై దాడులు జరుపుతున్నా గ్రామాల్లో గుడుంబా తయారీకి అడ్డుకట్ట పడడం లేదు.

ప్యాకెట్లుగా మార్చి..

జిల్లాలోని మారుమూల గ్రామాల్లో అధికారుల నిఘా అంతంతమాత్రంగానే ఉండడంతో ఇదే అదునుగా అక్రమార్కులు కాసుల కోసం సమీప ప్రాణహిత, వార్దా, పెద్దవాగు, పెన్‌గంగా నదుల సమీపాల్లో, వ్యవసాయ బావులు, వాగులు, అటవీ ప్రాంతాల్లోని పంట చేలలో గుడుంబా తయారీ స్థావరాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. పలువురు ఇళ్ల వద్ద తయారీ కేంద్రం ఏర్పాటు చేసుకొని యథేచ్ఛగా నాటుసారా తయారు చేస్తున్నారు. నాటుసారాను ప్యాకెట్లుగా మార్చి పోలీసుల కళ్లుగప్పి ఇతర గ్రామాలకు ద్విచక్రవాహనాలపై తరలిస్తున్నారు. కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలోని లంబాడీహెట్టి, గుప్పగూడెం, రణవెల్లి, మర్రిపల్లి, కల్వాడ దేవులగూడ, చింతకుంట గ్రామాల్లో ఎక్సైజ్ శాఖ అధికారులు దాడులు చేసి పలువురిపై కేసులు నమోదు చేశారు. గత నాలుగు నెలల్లో స్థావరాలపై దాడులు నిర్వహించి 109 కేసులు నమోదు చేశారు. 55 మందిని అరెస్ట్ చేసి 382 లీటర్ల నాటు సారా, 640 కిలోల బెల్లం, 70 కిలోల బెల్లం పట్టికను అబ్కారీ శాఖ అధికారులు పట్టుకున్నారు. నాటుసారా రవాణా చేస్తున్న 13 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకోవడంతోపాటు 65,700 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. 33 మంది పాత నేరస్తులను బైండోవర్ చేసినట్లు అబ్కారీశాఖ అధికారులు తెలిపారు.

సరిహద్దు మండలాల్లో..

ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో మద్యం వినియోగం విపరీతంగా పెరిగింది. దీంతో జిల్లాలోని పలువురు వైన్స్‌షాపుల యజమానులు మద్యం అధిక ధరలకు విక్రయిస్తున్నారు. దీంతో పేద, మధ్యతరగతులకు చెందిన వారు గుడుంబా వైపు చూస్తున్నారు. మహారాష్ట్ర సరిహద్దు మండలాలు కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్, దహెగాం, సిర్పూర్(టి), పెంచికల్‌పేట్, తదితర మండలాలకు సులువుగా బెల్లం సరఫరా అవుతుండటంతో నాటుసారా తయారీ సులువుగా మారింది. ఆయా మండలాల్లోని గ్రా మీణ శివారుల్లో గుడుంబా తయారీ స్థావరాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఎన్నికల కారణంగా గుడుంబా తయారీ కేంద్రాల్లో నాటుసారా త యారు చేసి సారాను ప్యాకెట్లలో గ్రామాల్లోని కి రాణా దుకాణాల్లో విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది.

అక్రమార్కులపై కఠిన చర్యలు



ఎంపీ ఎన్నికలను అదునుగా చేసుకొని పలువురు అక్రమార్కులు నాటుసారా తయారీ కేంద్రాలు ఏర్పాటు చేసుకున్నారు. ఎప్పటికప్పుడు అందిన సమాచారం మేరకు గుడుంబా తయారీ స్థావరాలపై దాడులు నిర్వహించి కేసులు నమోదు చేస్తున్నాం. నిత్యం తనిఖీలు నిర్వహించి నాటుసారా స్థావరాలపై ఉక్కుపాదం మోపుతాం. గ్రామాల్లో అక్రమంగా గుడుంబా విక్రయిస్తున్న వారిపై పోలీసులు, అబ్కారీ శాఖ అధికారులకు ప్రజలు సమాచారం తెలియజేయాలి.

– వి.రవి, ఎక్సైజ్‌శాఖ సీఐ, కాగజ్‌నగర్

అమిత్‌షా సభకు తరలివెళ్లిన నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం కాగజ్‌నగర్‌లో నిర్వహించిన బహిరంగసభకు కేంద్ర మంత్రి అమిత్‌షా వచ్చిన సందర్భంగా జిల్లా కేంద్రం నుంచి సుమారు 100 ప్రైవేటు వాహనాలలో భారీ సంఖ్యలో బీజేపీ కార్యకర్తలు, నాయకులు తరలివెళ్లారు. నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్రమోదీని 3వసారి ప్రధానిగా ఎన్నుకునేందుకు ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. నాయకులు సతీశ్‌బాబు, ఖాండ్రె విశాల్, కోట్నాక విజయ్, గణేశ్, ఇతర నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీసంఖ్యలో ఉన్నారు.

రెబ్బెన: కాగజ్‌నగర్‌లో ఆదివారం నిర్వహించిన బీజేపీ వికాస్ సంకల్ప యాత్రకు మండలం నుంచి భారీగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కేసరి ఆంజనేయులుగౌడ్ మాట్లాడుతూ దేశంలో మరోసారి బీజేపీనే అధికారం చేపట్టబోతోందన్నారు. యావత్ దేశం నరేంద్ర మోడీ నాయకత్వాన్ని కోరుకుంటుందని పేర్కొన్నారు. గ్రామాల్లో అభివృద్ధి జరగాలంటే మరోసారి బీజేపీని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కుందారపు బాలక్రిష్ణ, మండల ఉపాధ్యక్షుడు మధకర్, ప్రధాన కార్యదర్శి నవీన్‌గౌడ్ నాయకులు రాజేశ్ ఉన్నారు.



ఆసిఫాబాద్‌అర్బన్: కాగజ్‌నగర్ సభకు బయలుదేరిన బీజేపీ శ్రేణులు



రెబ్బెన: గోలేటి నుంచి తరలివెళ్తున్న నాయకులు

ట్రాఫిక్‌తో ఇబ్బందులు

కౌటాల/కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ పట్టణంలోని ఎస్పీఎం మైదానంలో ఆదివారం నిర్వహించిన బీజేపీ జనసభకు భారీగా ప్రజలు రావడంతో పట్టణంలో ట్రాఫిక్ సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. జనసభ ముగిసిన వెంటనే ఒక్కసారిగా వాహనాలు రోడ్డు మీదకు రావడంతో కాగజ్‌నగర్ రాజీవ్‌గాంధీ చౌరస్తాలో ట్రాఫిక్‌జామ్ అయింది. దీంతో స్థానిక పాత బస్టాండ్ చౌరస్తా, ఫ్లెటైవర్ వరకు వాహనాలు నిలిచిపోయాయి. దీంతో అరగంట పాటు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. అనంతరం పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కొమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా :
9010608462
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గంIIల నుండి రాత్రి 8.00 గంIIల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
కొమురంభీం ఆసిఫాబాద్ :
తిరుపతి, ACO - 7997958206
సిర్పూర్ కాగజ్‌నగర్ : కె.సాయికుమార్, S.R. - 7672055661
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899